క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శిధర్‌రెడ్డి తెలిపారు. డీఎంసీ ఫీడర్ పరిధిలో దేవరయాంజాల్ పరిధిలోని గోదాంలు, అర్కల్‌గూడ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

పర్యావరణ హిత మొబిలిటీ ఛాలెంజ్

సాక్షి, సిటీబ్యూరో: నగరాల్లో పర్యావరణ పరిస్థితుల్ని మెరుగుపరిచే దిశగా కాలుష్య రహిత రవాణాను ప్రోత్సహించేందుకు టయోటా మొబిలిటీ ఫౌండేషన్, ఛాలెంజ్ వర్క్స్ అండ్ వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్లు గ్లోబల్ ఛాలెంజ్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థల ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా నగరాల నుంచీ పర్యావరణ హిత రవాణాకు సంబంధించిన వినూత్న ఆవిష్కరణలను అన్వేషించి విజేతలను ఎంపిక చేస్తామన్నారు. ది సస్టెయినబుల్ సిటీస్ ఛాలెంజ్ పేరుతో దీన్ని నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన వారు వెబ్‌సైట్ ద్వారా అదనపు వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

నర్సరీని సందర్శించిన డీఆర్‌డీఏ

కీసర: కీసర మండలంలోని గోధుమకుంట నర్సరీని డీఆర్‌డీఏ పద్మజారాణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో హరిత హారం కార్యక్రమానికి సరిపోను మొక్కలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్‌రెడ్డి, జైపాల్ పాల్గొన్నారు.

నాగారంలో నోట్‌బుక్స్ పంపిణీ



నాగారంలో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న రామశర్మ, ప్రతాపరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం జెడ్పీ పాఠశాలలో సోమవారం శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా ఆలయం కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, రామశర్మ, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై 900 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, భిక్షపతి, సత్తిరెడ్డి, బల్వంతరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం నిర్మాణానికి భూమిపూజ



స్తూపం పనులకు పూజలు నిర్వహిస్తున్న చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి

మేడ్చల్: పట్టణంలోని మూడవ వార్డు పరిధిలో అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి సోమవారం భూమిపూజ నిర్వహించారు. కేఎల్ ఆర్ నగర్ కమాన్ వద్ద స్తూపం నిర్మాణానికి భూమి పూజా నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు వీరభద్రారెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఘట్‌కేసర్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. సోమవారం గుంటిగూడెం చెందిన సాయినాథ్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. సాయినాథ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందగా ఆయనకు మంజూరైన రూ.22,500 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కౌన్సిలర్ నాగజ్యోతితో కలిసి అందజేశారు.

23వ వార్డులో కంటి వెలుగు ప్రారంభం

మేడ్చల్: రెండో విడతలో భాగంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ కొడే మహేష్‌తో కలిసి చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి సోమవారం ప్రారంభించారు. వార్డు ప్రజలు శిబిరానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. అవసరమైన వారు కంటి అద్దాలు, మందులు పొందాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా శిబిరాన్ని నిర్వహించి అందరికీ పరీక్షలు పూర్తిచేసే వరకు శిబిరం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు బాలమణి, అనిత, నాయకులు శ్రీశైలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల బంధు

- నియోజకవర్గానికి 1,100 మందికి దళిత బంధు
- రెండో విడత అమలుకు అధికార యంత్రాంగం సన్నాహాలు
- ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ
- మొదటి విడతలో నియోజకర్గానికి 100 మందికి మాత్రమే లబ్ధి
- లబ్ధిదారుల ఎంపికలోనూ ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు
- సమగ్ర సర్వే ఆధారంగా మండలాలు, డివిజన్లు వార్డుల వారీగా ఎస్సీల జాబితా వివరాల సేకరణపై కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: దళిత కుటుంబాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం అమలుకు గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని సంబంధిత అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసిన తెలంగాణ సర్కారు.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒక్కో నియోజకవర్గంలో 1,100 చొప్పున గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల పరిధిలోని 27 అసెంబ్లీ నియోజకవర్గాలలో 29,700 మంది దళిత కుటుంబాలకు వర్తింపజేసేందుకు దళిత బంధు పథకాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో గ్రేటర్ సహా శివారు జిల్లాల సంబంధిత అధికారులు కూడా దళిత బంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మండలాల వారీగా సేకరణ

లబ్ధిదారుల ఎంపికకు జిల్లాల వారిగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రూరల్‌లో మండలాలు, పురపాలక సంఘాల్లో డివిజన్లు/వార్డుల వారీగా ఎస్సీ జనాభా, కుటుంబాల సంఖ్య తదితర వివరాలు సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా సేకరిస్తున్నారు. రెండు రోజుల కిందట ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కలెక్టర్లకు లబ్ధిదారుల ఎంపికకు అనుసరించాల్సిన విధి విధానాలపై సూచనలు చేశారు. రెండో విడత దళిత బంధు పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది.

విధి విధానాలపై కసరత్తు

ఒక్కో దళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేసి, వారి ఉన్నతికి తోడ్పడటమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మొదటి విడతలో లబ్ధిదారులను ఎమ్మెల్యేలు ప్రతిపాదించగా ఇన్‌చార్జి మంత్రి ఆమోదించారు. దీంతో ఎంపిక పూర్తిగా ఏకపక్షంగా చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం రెండో విడత ఎంపికకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

అక్రమాలు అరికడితేనే ప్రయోజనం

గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో మొదటి విడత దళిత బంధులో ఎంపికై న లబ్ధిదారుల్లో కొందరు యూనిట్లు విక్రయించుకున్నారనే ఆరోపణలున్నాయి. మరికొందరు యూనిట్లు స్థాపించుకుని ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దళారులుగా వ్యవహరించి లబ్ధిదారుల నుంచి యూనిట్లను కాజేసినట్లు విమర్శలు ఉన్నాయి. మెజారిటీ లబ్ధిదారులు వాహనాల కొనుగోలుకే మొగ్గుచూపారు. దీంతో ఉపాధి కొరవడి వాటిని నిర్వహించే ఆర్థిక స్తోమత లేక తక్కువ ధరకే విక్రయించుకుంటున్నట్లు తెలుస్తోంది. రెండో విడత దళిత బంధులో గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అధికార యంత్రాంగం భావిస్తున్నట్లు తెలుస్తోంది. దళారుల బెడద లేకుండా నేరుగా లబ్ధిదారుల సమక్షంలోనే యూనిట్ల ఎంపికపై అవగాహన కల్పించాల్సింది. ఉపాధి కల్పనపై ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మొదటి విడతలో 2,700 మందికే..

మొదటి విడత దళిత బంధు పథకంలో భాగంగా గ్రేటర్ సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 100 చొప్పున 27 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,700 మందికి దళిత బంధు పథకాన్ని వర్తింపజేశారు.

ప్రగతి భవన్‌ను ముట్టడిస్తాం

- కలెక్టరేట్ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎల్.మూర్తి
- పాఠ్యపుస్తకాలు, టీచర్లు లేకుండా పాఠాలు ఎలా చదవాలి..?
- ప్రైవేటులో ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నా పట్టదా..?
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కేవీఎల్.మూర్తి తీవ్రంగా ధ్వజమెత్తారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందిస్తామని గొప్పలు చెప్పినా, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా యూనిఫామ్ రాలేదన్నారు. తెలంగాణ విద్యా దినోత్సవానికి విద్యార్థులు పాఠశాలలకు పాత బట్టలతోనే హాజరయ్యారని ఎద్దేవా చేశారు.

- అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీఎల్.మూర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్, గురుకుల, సంక్షేమ హాస్టళ్లకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కాలేదని, పేద విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 వేల టీచర్, 12 వేల లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఒక మేడ్చల్ జిల్లాలో 15 మండలాలు ఉంటే.. ముగ్గురు విద్యాధికారులు మాత్రమే పని చేయటం సిగ్గుచేటన్నారు.
- కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇంజినీరింగ్, మెడికల్ సీట్ల ఫీజులకు నియంత్రణ లేదని, వెంటనే నియంత్రణ చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పేరుతో రూ.లక్షల వ్యాపారం చేస్తున్నా.. ప్రభుత్వం చోద్యం చూస్తోందని పేర్కొన్నారు.
- కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట దాదాపు గంటసేపు ధర్నా నిర్వహించారు. పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అరెస్టు చేసి శామీర్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కిరణ్, అరుణ్, ప్రసాద్, శ్రీను, శ్రీశైలం, నరసింహ, పవన్, ప్రసాద్ పాల్గొన్నారు.



మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

డబుల్ ఇళ్లను జవహర్‌నగర్‌లోని పేదలకే ఇవ్వాలి

- కాంగ్రెస్‌ను గెలిపిస్తే 100శాతం ఇక్కడి పేదలకే ఇస్తాం
- జవహర్‌నగర్ ప్రజలను మోసం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి
- టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ నిరసన దీక్షలో మాట్లాడుతున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద 'పేదల గూడు.. తీరని గోడు..' పేరుతో నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి జవహర్‌నగర్ నా గుండెకాయ అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేస్తున్నారని, జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జవహర్‌నగర్ వాసులకు కాకుండా బయట వ్యక్తులకు కేటాయిస్తే ఊరుకునేదిలేదన్నారు. ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచిన మల్లారెడ్డి నూరు శాతం ఇక్కడ నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇక్కడి నిరుపేదలకే ఇవ్వాలని, లేదంటే మంత్రి మల్లారెడ్డికి ఓటమి ఖాయం అన్నారు. ప్రజలు మంత్రి మల్లారెడ్డిని, ఈ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే స్థానికులకే 100 శాతం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రభుత్వం ఏర్పడిన ఆర్నెళ్లలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి గోగుల సరితవెంకటేష్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పత్తి కుమార్, రాహుల్ యాదవ్, పోచయ్య, సునీత, సుశాంత్‌గౌడ్, మహేష్, కిషోర్‌గౌడ్, కార్పొరేటర్ అజయ్‌యాదవ్, వినయ్, సదానంద్, రాజు, వేణు, సుమన్, రజితగోపాల్, లత, లక్ష్మీ, సరిత, సునీత, రాజలక్ష్మీ, ప్రమీల, శ్రీను, ఆనంద్, రాజుయాదవ్, సోమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌కు నిధులివ్వాలని వినతి



మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డిలతో మేయర్ కావ్య

జవహర్‌నగర్: ఉప్పల్ చౌరస్తాలో నిర్మించిన స్కై వాక్‌ను ప్రారంభించడానికి వచ్చిన రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని సోమవారం జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య కలిశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ అభివృద్ధికి అదనంగా రూ.30 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఆమె వారిని కోరారు.

పట్టణ అభివృద్ధే ప్రధాన ధ్యేయం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: మేడ్చల్ పట్టణ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికనర్సింహరెడ్డి అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో వివిధ వార్డుల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం, మురుగు కాలువ నిర్మాణం చేపట్టి ప్రజల దీర్ఘకాలిక సమస్యలను తీర్చామన్నారు. అన్ని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధిలో పట్టణంలో 13వ వార్డును అగ్రగామిగా నిలిచేలా పనిచేస్తున్నామని కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

కబ్జా చేసిన భూమిని తిరిగి ఇప్పించాలని మంత్రికి వినతి

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లోని సర్వే నంబర్ 334, 335, 337, 338, 340లోని మా భూమిని కబ్జా చేసిన వారి నుంచి తిరిగి మాకు ఇప్పించాలని కొర్రెముల్‌కు చెందిన బాధితులు మంత్రి మల్లారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. బోడుప్పల్‌కు చెందిన జెడిగే రమేశ్ అనే వ్యక్తి మాలో ఒకరి వాటాలో 5 ఎకరాల భూమి కొనుగోలు చేసి జేకే ఫంక్షన్ హాలు నిర్మించాడని, కొనుగోలు చేసిన భూమితో పాటు మా రెండెకరాల భూమిని ఆక్రమించి పశువుల షెడ్డు నిర్మించాడని మంత్రికి ఇచ్చిన లేఖలో ఆరోపించారు. మొత్తం భూమిని అధికారికంగా కొలిచి ఎవరి వాటా వారు తీసుకుందామంటే, భూమి లేదు ఎవరికి చెప్పుకుంటోరో చెప్పుకొండని, భూమిపైకి వస్తే చంపేస్తానని బెదిరిస్తూ మాపై దాడి చేశాడన్నారు. అలాగే మా భూమి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని, ఈ విషయమై మాకు న్యాయం చేయాలని ఆంజనేయులు, శ్రీశైలం, హరికృష్ణ, అఖిల, బాలకృష్ణ, శివకుమార్ తదితరులు కోరారు.

ముస్లిం శ్మశానవాటిక పనుల పరిశీలన



శ్మశానవాటిక పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి

ఘట్‌కేసర్: కొండాపూర్‌లో ముస్లింలకు కేటాయించిన రెండు ఎకరాల భూమిలో చేపట్టిన పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి ఆదేశాలతో రూ.25 లక్షలతో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ అధ్యక్షుడు కుతుబ్, నాయకులు అస్లాం, ఫయూమ్, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ విజయాలపై ఇంటింటి ప్రచారం



మైసమ్మగూడలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: ప్రధాని మోదీ ప్రభుత్వ విజయాలపై బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ, అర్కలగూడెం గ్రామాల్లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్ అమరం సరస్వతి, హంసరాణి, నాయకులు గడపగడపకూ వెళ్లి కరపత్రాలు పంచి మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమలో పార్టీ బూత్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

యువతులను వేధిస్తున్న నిందితులకు రిమాండ్

ఘట్‌కేసర్: సోషల్ మీడియాలో యువతులను వేధిస్తున్న ముగ్గురు నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ పీఎస్‌లో మల్కాజిగిరి డీసీపీ జానకీ, ఏసీపీ నరేశ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఓ కళాశాలలో ఉండే యువతుల ఫోన్లకు గుర్తు తెలియని వ్యక్తులు బ్లాంక్ కాల్స్ చేస్తూ వాట్సాప్‌లో అసభ్య పదజాలంతో మెసేజ్‌లు పెడుతున్నారని ఈ నెల 22న ఆ కళాశాల ప్రిన్సిపల్ ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, కాకినాడ నుంచి కాల్స్ వస్తున్నట్లు గుర్తించారు. కాగా నిందితులు గుంటూరుకు చెందిన లక్ష్మీగణేశ్(20), ఇంద్రపాలెం కాకినాడ, తూర్పుగోదారికి చెందిన కోటగిరి వీరబాబు(20), కాకినాడకు చెందిన చిట్టిబోయిన దుర్గరాజు(25)ను ఘట్‌కేసర్ పట్టణంలో ఉండగా సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి మూడు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తక్కువ సమయంలో పట్టుకున్నందుకు ఘట్‌కేసర్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు సుధాకర్, అశోక్, శ్రీకాంత్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



జవహర్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జవహర్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రులతో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఓపీ, రిజిస్టర్, ఏఎన్సీ, ల్యాబ్‌లో రక్త నమూనాల సేకరణను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజారోగ్యం సమస్యలు తీర్చేలా అందుబాటులో ఉండాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమకాటు వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యాధికారులు, నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



ఘట్‌కేసర్‌లో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి సొంత నిధులతో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి పేదరికం అడ్డురావొద్దని నోట్‌బుక్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు షౌకత్, బీఆర్ఎస్ మున్సిపల్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రాందాస్, నజీర్, ఉపాధ్యాయులు ఐషా, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం మమత, ఇక్బాల్, రెడ్డప్ప, కెఫా పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాబురావు, ఆంజనేయులు

ఘట్‌కేసర్: కొర్రెముల్ పరిధిలోని సర్వే నంబర్ 322, 336లోని భూమిని అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఆ గ్రామానికి చెందిన బాబురావు, ఆంజనేయులు, వినోద్ తదితరులు కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని లేఖలో ఆరోపించారు. అక్రమంగా ప్రభుత్వ భూమిలో చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని లేఖలో కోరారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఘట్‌కేసర్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నరేశ్‌ముదిరాజ్, శ్రీనివాస్, వేణుగోపాల్

ఘట్‌కేసర్: ముదిరాజ్ విలేకరిని కిడ్నాప్ చేసి దాడి చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘట్‌కేసర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నరేశ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం దహనం చేశారు. మరొకసారి ఇటువంటివి చోటుచేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అతడిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వెంకటాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లింగంముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, వేణుగోపాల్‌ముదిరాజ్, ప్రభాకర్‌ముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, చంద్రశేఖర్‌ముదిరాజ్, ఆంజనేయులుముదిరాజ్, రవీందర్‌ముదిరాజ్, శ్రీశైలంముదిరాజ్, బలరాంముదిరాజ్, శంకర్‌ముదిరాజ్, రాజలింగంముదిరాజ్, పోచయ్యముదిరాజ్, బుచ్చిరాజుముదిరాజ్ పాల్గొన్నారు.